క్లుప్తంగా

'హర్ ఘర్ జల్'ను సద్వినియోగం చేసుకోండి



ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

చిల్లకూరు: ప్రభుత్వం హర్ ఘర్ జల్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఉచితంగా వేస్తున్నారని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్ తెలిపారు. మండలంలోని తమ్మినపట్నం, పొన్నవోలు, లింగవరం, ఏరూరు గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు ఏర్పాటు చేసి, ప్రజలకు తాగునీటి వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో తాగునీటి కొళాయి కనెక్షన్ తీసుకోవాలంటే డిపాజిట్లు చెల్లించాల్సి వచ్చేదని, అయితే నేడు ప్రభుత్వం హర్ ఘర్ జల్ పథకం కింద ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు అందిస్తుందన్నారు. వర్షపునీటి పరిరక్షణతో భావితరాలకు నీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ విజయకుమార్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెంకయ్యకు పీహెచ్‌డీ



వాకాడు: మండలంలోని బూడిదలవాగు గ్రామానికి చెందిన కడూరు వెంకయ్యకు బుధవారం నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఎస్‌బీ సాయినాథ్ పర్యవేక్షణలో బయోటెక్నాలజీలో ఏలూసిడేషన్ ఆఫ్ మొలర్క్యులర్ అండ్ బయోకెమికల్ రెస్పాన్స్ ఇన్ ది రెగ్యులేషన్ ఆఫ్ రిప్రొడక్షన్ ఇన్ ది మడ్ క్రాబ్, స్కిళ్ల సెరేట్ బై రిటినోయిడ్స్ అండ్ ఎగ్ డైస్టిరాయిడ్స్ అనే అంశంలో పరిశోధన పత్రాలు సమర్పించడంతో వెంకయ్యకు పీహెచ్‌డీ ఇచ్చారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు





గాయపడిన కార్తీక్, ఈశ్వరయ్య

నాయుడుపేటటౌన్: మండలంలోని నరసారెడ్డి కండ్రిగ సమీపంలో జాతీయ రహదారి కూడలి వద్ద బుధవారం రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. అన్నమేడు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, ఆయన తమ్ముడి కుమారుడు కార్తీక్‌ను తీసుకుని బైక్‌లో నాయుడుపేటకు బయలు దేరాడు. మార్గం మధ్యలో నరసారెడ్డి కండ్రిగ సమీపంలో రోడ్డు దాటుతుండగా నెల్లూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఈశ్వరయ్యతోపాటు కార్తీక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ పరిస్థితి విషమించడంతో నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, కారు సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందరూ దైవభక్తి పెంపొందించుకోవాలి

పెళ్లకూరు: ప్రతి మనిషి దైవభక్తి పెంపొందించుకోవడంతో మానవత్వంతో ముందుకు సాగే గుణం అందరిలోనూ మెరుగవుతుందని నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం చిల్లకూరులో కొత్త గా నాగార్పమ్మ శిలా విగ్రహాన్ని కామిరెడ్డి దంపతులు చేతులు మీదుగా ప్రతిష్టించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడానికి కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు 175 స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం నాగదేవత శిలావిగ్రహాన్ని ప్రతిష్టించారు. సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



హిందు ధర్మ ప్రచార పరిషత్ నెల్లూరు జిల్లా నూతన కార్యవర్గం

నాయుడుపేటటౌన్: హిందూ ధర్మ ప్రచార పరిషత్ నెల్లూరు జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఆ పరిషత్ ఆర్గనైజర్ ఆర్ స్వామి నాయక్ వెల్లడించారు. తుమ్మూరులోని టీటీడీ కల్యాణ మండపంలో స్వామినాయక్ అధ్యక్షతన హిందూ ధర్మ ప్రచార పరిషత్ నెల్లూరు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎన్నికలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా నాయుడుపేట పట్టణానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నెల్లూరు జయరామయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కేవీ మోహన్ (వరికుంటపాడు), కార్యదర్శిగా సారేపల్లి రవికుమార్ (అల్లూరు), కోశాధికారిగా వేమిరెడ్డి సనత్ కుమార్‌రెడ్డి (నెల్లూరు), జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ గౌరవ సభ్యులు సీవీ సుబ్రహ్మణ్యం, వీ విజయ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ ఎం రమణయ్య, డీ సురేంద్రబాబు పాల్గొన్నారు.

శీతాకాలం.. హద్దులు లేని వలప విహారి ఆగమనం.. ఆ విహంగాల విన్యాసం.. కిలకిలరావం.. వెరసి నేలపట్టులో ప్రకృతి అన్ని రకాల మురిసిపోతోంది. ఆ మనోహర దృశ్యం వర్ణనాతీతం. ఆ పల్లెవాసులు ఉద్యోగాల రీత్యా వలస వెళ్లినా.. రకరకాల పక్షులు విదేశాల నుంచి ఆ పల్లెకు వచ్చేందుకు ఇష్టపడుతున్నాయి. వాటిని వీక్షించే జనంతోపాటు పర్యాటకులకు అవి ఆహ్లాదసిరిని పంచుతున్నాయి.

విదేశీ విహారి.. ఆహ్లాదసిరి!



చెరువులో చెట్లపై నత్తగుళ్ల కొంగలు



- ఆసక్తిగా తిలకిస్తున్న పక్షి ప్రేమికులు
- గుడ్లు పెట్టి పొదిగిన నత్తగుళ్ల కొంగలు, నీటి కాకులు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ప్రకృతి అందాలైన శీతకాలపు వలస విహంగాలు సందడి చేస్తున్నాయి. వీటి తిలకించేందుకు పక్షి ప్రేమికులు, సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పక్షుల కేంద్రంలో గూడబాతులు, నత్తగుళ్ల కొంగలు, తెల్లకంకణాయిలు, నీటికాకులు, నైట్ హేరాన్స్ తదితర పక్షులు వందల సంఖ్యలో విడిది చేస్తున్నాయి. సీజన్‌కు ముందే విచ్చేసిన నత్తగుళ్ల కొంగలు, నీటికాకులు మాత్రం ఇప్పటికే కేంద్రంలోని చెరువులో ఉన్న కడప చెట్లపై గుడ్లు పెట్టి, పొందిగాయి. మిగిలిన పక్షులన్నీ జత కట్టే పనిలో ఉన్నాయి. పొదిగిన పక్షి పిల్లల కేరింతలు పిల్లలను పెద్దలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మరో వైపు చెరువుల్లో గూడబాతులు ఈతాడుతూ వాటి విన్యాసాలు చూపర్లను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం కేంద్రంలో స్థానిక వన్యప్రాణి సిబ్బంది లెక్కల ప్రకారం నత్తగుళ్ల కొంగలు 1,345, గూడబాతులు 380, నీటికాకులు 578, నైట్‌హేరాన్స్ 130, విజలింగ్ డక్స్ 70, వైట్ ఐబీస్ 80, నీల్ డక్, లార్జ్‌ఈగ్రేట్, కూట్స్ తదితర పక్షులు పదుల సంఖ్యలో ఈ కేంద్రంలో విడిది చేస్తున్నాయి. వర్షాలు కురిసి కేంద్రం పరిధిలోని అత్తిగుంట, నేరేడుగుంట, మారేడుగుంట చెరువుల్లోకి సాగు నీరు పూర్తి స్థాయిలో చేరితే మరి కొన్ని పక్షులు వందల సంఖ్యలో రావాల్సి ఉందని ఫారెస్టు సిబ్బంది తెలిపారు.



చెరువులో ఈత కొడుతున్న గూడబాతులు

గుర్రపుడెక్కతో గూడ బాతులకు ఆటంకం

పక్షుల కేంద్రం పరిధిలోని చెరువుల్లో సగానికి పైగా తీగజాతికి చెందిన గుర్రపుడెక్క మొక్కలు ఏపుగా పెరిగి చెరువులు మొత్తం అల్లుకుపోవడంతో ఈతాడే గూడబాతులకు పెద్ద ఆటంకంగా మారింది. సీజన్ మొదలుకాక ముందే ఆ దిశగా స్థానిక అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో చెరువులో ఈతాడే గూడబాతులతోపాటు వివిధ పక్షులకు గుర్రపుడెక్క ఇబ్బంది మారింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో చెరువు కట్టపై, మార్గం మధ్యలో సందర్శకులకు బురద కాకుండా సంబంధిత అధికారులు రాక్‌డస్ట్ వేసి తగు చర్యలు చేపట్టారు.

సంతానానోత్పత్తి.. ఆహారం కోసం..



పక్షుల కేంద్రానికి ఏటా విదేశీ విహంగాలు వాటి సంతారాభివృద్ధి చేసుకునేందుకు క్రమం తప్పకుండా వస్తుంటాయి. అందులో గూడబాతులు, నత్తగుళ్లకొంగలు, తెల్లకంకణాయిలు, నీటికాకులు, తెడ్డుముక్కు కొంగలు, బుడగ బాతులు విచ్చేసి సంతానం చేసుకుని వెళ్లిపోతాయి. అలాగే పక్షుల కేంద్రంలో ఆహారం కోసం నారాయణ పక్షుల, శబరి కొంగలు, స్వాతి కొంగలు, పెద్ద నీటి కాకులు, పశువుల కొంగలు, సూదితోక బాతులు, చుక్కకోడి, పరజ తదితర పక్షులు వస్తాయి.

సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకుపోదాం

సైదాపురం(వెంకటగిరి): జగనన్న సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకునిపోదామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఎన్‌జీఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురువారం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అన్న కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మండల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు అందరూ కలిసికట్టుగా ప్రతి ఇంటికీ వెళ్లి ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు సమగ్రంగా వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, మండల కన్వీనర్లు కే శ్రీనివాసులురెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పీ ప్రసాద్‌రెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, టీ వెంకటప్రసాద్ చౌదరి, లక్ష్మీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సంక్షేమ పథకాల డిస్‌ప్లే ఆవిష్కరణ

చిట్టమూరు: మండలంలోని అరవపాళెం సచివాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే ఆవిష్కరించనున్నట్లు ఈఓపీఆర్డీ మనోహర్ గౌడ్ బుధవారం తెలిపారు. సచివాలయంలో పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం అందజేసిన పలు సంక్షేమ పథకాలను తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలో 15 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల వివరాలను కంప్యూటరీ కరణ చేశామన్నారు.

కండలేరులో 11.297 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.297 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నెరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలకు వివరించండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్ రెడ్డి

కలువాయి: ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ప్రజలకు పూర్తిగా వివరించి చెప్పాలని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, ఇతర పథకాల గురించి వివరించడంతో పాటు గతంలో ప్రభుత్వాలు అమలు చేసిన కార్యక్రమాలకు, ఇప్పుడు అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఉన్న తేడాను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పర్యావరణం కాపాడుదాం



ర్యాలీ చేస్తున్న ఏఆర్‌డీ ప్రతినిధులు

చిల్లకూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఏఆర్‌డీ సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. గూడూరుకు చెందిన ఏఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో నెల రోజులు పాటు నిర్వహించ తలపెట్టిన గ్లోబల్ యాక్షన్ మంత్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బల్లవోలు గ్రామంలో గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు చెట్లు ఎక్కువగా నరికివేస్తున్న కారణంగా వాయు కాలుష్యం ఎక్కువగా జరిగి, వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఫలితంగా ఓజోన్ పొరకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. దీన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచాలన్నారు. ఆ సంస్థ మండల కో ఆర్డినేటర్లు, భాస్కర్, కే రామానుజం తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా నిరుద్యోగులకు వరం



ఎమ్మెల్యేతో చర్చిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ అధికారులు

గూడూరురూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళా నిరుద్యోగులకు ఒక వరం అని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలసి, త్వరలో చేపట్టనున్న జాబ్ మేళాపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులకు ఎన్నో అవకాశాలను కల్పించే క్రమంలో ఈ నెల 20వ తేదీ జాబ్ మేళా ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ పలు పరిశ్రమలకు చెందిన సంస్థలు జాబ్ మేళాలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిస్తున్నాయని తెలిపారు. ఆర్ పిచ్చయ్య నాయుడు పాల్గొన్నారు.

మండల కార్యాలయానికి వాస్తుదోషం పట్టిందట!



మండల పరిషత్ కార్యాలయంలో మరమ్మతులు చేస్తున్న కూలీలు

- వాస్తు పేరుతో మండల నిధులకు తూట్లు
- ఇన్‌చార్జి ఎంపీడీఓలు వచ్చిన ప్రతిసారీ ఇదే తంతు

చిల్లకూరు: మండల పరిషత్ కార్యాలయం ప్రారంభించి 35 ఏళ్లు కావస్తుంది. అప్పటి నుంచి రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు ఈ భవనంలోనే విధులు నిర్వహించారు. అయితే 7 ఏళ్ల కిందట రెవెన్యూ కార్యాలయం నూతనంగా నిర్మించడంతో రెవెన్యూ అధికారులు మండల పరిషత్ కార్యాలయాన్ని ఖాళీ చేసి, అక్కడికి వెళ్లారు. అప్పటి నుంచి ఎంతో మంది మండల పరిషత్ అధికారులు పనిచేసి వెళ్లారు. వారంతా అప్పట్లో వారికి కేటాయించిన గదిలోనే ఉండి విధులు నిర్వహించారు. ఆ గదిని కూడా పలుసార్లు మండల నిధులతో మర మ్మతులు చేసుకున్నారు. అయితే గత రెండేళ్లలో ఇద్దరు ఇన్‌చార్జి ఎంపీడీఓలు వచ్చి రాగానే వాస్తుదోషం పేరుతో గదులను మార్పు చేసుకునేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందుకు మండల సర్వ సభ్య సమావేశంలో కూడా అనుమతులు తీసుకోకుండానే ఇష్టానుసారం మండల నిధులను ఖర్చు చేసి, మరమ్మతులు చేస్తున్నారు. కార్యాలయంలో ప్రస్తుతం 4 మరుగుదొడ్లు ఉండగా మరొకటి నూతనంగా నిర్మించేందుకు రూ.2 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ నిధులతో ఎంపీడీఓ ఉండే గది, ఆయనకు అనుబంధంగా ఉండేలా విశ్రాంతి గది ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలా మండల పరిషత్ నిధులు వాస్తుపేరుతో దుబారా చేయడంపై ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపీనాథ్‌ను వివరణ కోరగా ఈ మరమ్మతు పనులు గతంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నిర్మలాదేవి ఉన్న సమయంలో ఆమోదించినవని, తాను వచ్చి కేవలం వారం రోజులే అయ్యిందని, తనకు ఇంకా నిధుల వినియోగానికి సంబంధించిన అధికారాలు కూడా రాలేదన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

కలువాయి: మండలంలోని కుల్లూరు లేఅవుట్‌లో జగనన్న గృహకల్ప పథకం కింద పక్కా ఇళ్ల నిర్మాణ పనులకు బుధవారం జేసీఎస్ కన్వీనర్ మాదాను యజ్ఞపవన్ భూమిపూజ చేసి, ప్రారంభించారు. ఇక్కడ నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేయాలని ఆయన హౌసింగ్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మహేష్, సర్పంచ్ అంకయ్య, హౌసింగ్ సిబ్బంది చెంచుకృష్ణ పాల్గొన్నారు.

పన్ను వసూలు చేయాలి

చిల్లకూరు: ఆర్థిక సంవత్సరం సగం పూర్తి కావస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఈఓపీఆర్‌డీ మాణిక్యం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 పంచాయతీల్లో చిల్లకూరు పంచాయతీ గూడూరు మున్సిపాలిటీలో విలీనం కావడంతో అక్కడ పన్నులు మున్సిపాలిటీ చూసుకుంటుందని, మిగిలిన పంచాయతీల్లో పరిశ్రమలు, ఇంటి పన్ను త్వరగా వసూలు చేసి ఖాతాలో జమ చేయాలని అన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

వెంకటగిరిరూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే దిశగా సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం సురేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బంగారుపేట, ధర్మాపురం ప్రాంతాల్లో పర్యటించి, విశ్వరూప మహాసభ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన సికింద్రాబాద్‌లో పెరేడ్ గ్రౌండ్‌లో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రతి మాదిగ పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కిట్ల పంపిణీ

సైదాపురం: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమానికి సంబంధించిన కిట్లను బుధవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం రవి కుమార్ నేతలకు కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని అందరూ కలిసి కట్టుగా పని చేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, సొసైటీ అధ్యక్షుడు జీ శివకుమార్, వైస్ ఎంపీపీ భాస్కర్, నేతలు రామ్‌గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, వివేక్‌రెడ్డి, సర్పంచ్ వరప్రసాద్‌రాజు, రాజశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన రాష్ట్రానికి ఎంతో అవసరం



వెంకటగిరిరూరల్: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కలువాయి: దాచూరులో బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

వెంకటగిరిరూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన రాష్ట్రానికి ఎంతో అవసరమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఐదో వార్డు ఎన్టీఆర్ కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల అందుతున్నాయా? లేదా అని..స్థానికులను ఈ సందర్భంగా నేదురుమల్లి ఆరా తీశారు. అనంతరం స్థానికుల సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో నవరత్నాలతోపాటు మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు నింపారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎం జానకిరామయ్య, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, ప్రముఖ న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ వహిద, నేతలు ప్రసాద్, సీ మురళి పాల్గొన్నారు.

సంక్షేమమే గెలిపిస్తుంది

కలువాయి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఆయన్ని మరోసారి గెలిపిస్తాయని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి మండలం దాచూరు సచివాలయం పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు పి.పెంచలనరసారెడ్డి, డీ రమాదేవి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, నాయకులు డీ హరిరెడ్డి, డి.రామచంద్రారెడ్డి, డి.శివారెడ్డి, డి.రమణారెడ్డి, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



తాజుద్దీన్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గూడూరురూరల్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు అధినేత సయ్యద్ తాజుద్దీన్‌ను వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బత్తిన విజయకుమార్ బుధవారం డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఘనంగా సత్కరించారు. తాజుద్దీన్ ఇటీవల ఐకానిక్ పీస్ జాతీయ స్థాయి అవార్డును అందుకున్న సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలోనే పట్టణంలోని వైఎస్సార్ ట్రస్టు చైర్మన్ బత్తిన విజయకుమార్ ఆయన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి బీ గోపి, నరేంద్ర చైదరి, నాయకులు డీ సురేంద్ర, రాఘవులు, హనుమంతరావు, జీ చందు, సయ్యద్ అల్తాఫ్, గిరిబాబు, ఎస్ఎల్ఎన్ స్వామి, ఎస్‌కే అమ్మద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి పోయండి

వారిది రెక్కాడితే కానీ డొక్కనిండని కుటుంబం.. రోజు కూలితో సాఫీగా సాగుతున్న జీవనం.. ఇంతలో మాయదారి రోగం కబళించింది.. రూ.లక్షలు అప్పు చేసి..వైద్యం చేయించుకున్నా.. తగ్గినట్టు తగ్గి.. మళ్లీ తిరగబెట్టింది. వెరసి ఆ పేద గిరిజన మహిళ మంచం పట్టి మృత్యువుతో పోరాడుతోంది. దయగల దాతలూ నాకు ఊపిరిపోయండని అభ్యర్థిస్తోంది.

- క్యాన్సర్‌తో పోరాడుతున్న గిరిజన మహిళ పావని
- దాతల సాయం కోసం ఎదురుచూపు



మంచానికే పరిమితమై మృత్యువుతో పోరాడుతున్న పావని

గూడూరురూరల్: మండలంలోని విందూరు గిరిజన కాలనీకి చెందిన వెంకటపతి, లక్ష్మమ్మ దంపతులకు కుమార్తె పావని ఉంది. వీరు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుమార్తె పావనికి ముత్తుకూరు మండలం ఇస్కపాళేనికి చెందిన శ్రీనివాసులుకు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. దీంతో పావని జీవనం సాఫీగా సాగుతున్న తరుణంలో తల్లిదండ్రులు చనిపోవడంతో విందూరుకు కాపురం వచ్చేశారు. ఏడాదిగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రూ.లక్షలు అప్పులు చేసి, నెల్లూరు, తిరుపతి, చెన్నై తదితర ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకున్నారు. కాస్త నయం అయినట్లు అనిపించినా మళ్లీ వ్యాధి తిరగబెట్టడంతో కట్టుకున్న భర్త కూడా ఆమెను వదిలి వెళ్లిపోయాడు. నడవలేని స్థితిలో మృత్యువుతో పోరాడుతూ మంచానికే పరిమితమై కాలం వెళ్లదీస్తోంది. 28 ఏళ్లకే క్యాన్సర్ మహమ్మారి సోకి తన జీవితం ఇలా అయ్యిందంటూ గిరిజన మహిళ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. దీంతో ఆమె తమ్ముడు, చెల్లెలు పావనిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వైద్యం చేయించుకునే స్తోమత లేకపోవడంతో బతుకు జీవుడా అంటూ దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు, సేవా సంస్థలు స్పందించి తన ప్రాణాన్ని కాపాడాలని అభ్యర్థిస్తోంది. దయార్థ హృదయం గల దాతలు 76720 80106, 95152 58379 నంబర్లలో సంప్రదించి, దానం చేసి, గిరిజన యువతి పావని ప్రాణాన్ని కాపాడాలని ప్రాధేయపడుతున్నారు.